క్లుప్తంగా

విజయనగరంలో భారీ వర్షం



కాంప్లెక్స్ రోడ్డులో కురుస్తున్న వర్షం

విజయనగరం: జిల్లా కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన వర్షం 4.30 వరకు గంటన్నర పాటు కురిసింది. అల్పపీడనం ప్రభావంతో మరో రెండు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం ఖరీఫ్ సీజన్‌కు ఎంతో అనుకూలమని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా వర్షాలతో వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

నేడు వల్లూరులో గడప గడపకు..

నెలిమర్ల రూరల్: మండలంలోని వల్లూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిరిబాల ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు, సిబ్బంది హాజరుకావాలని కోరారు.

సేవాభావంతో సమాజానికి మేలు



పేదలకు నిత్యావసర సరుకులు అందిస్తున్న డీఎస్పీ, సర్పంచ్, తదితరులు

డెంకాడ: సేవాభావంతో సమాజానికి మేలు జరుగుతుందని డీఎస్పీ శేషాద్రి అన్నారు. విజయనగరంలోని బాలాజీనగర్ ప్రాంతానికి చెందిన అమ్మ సేవా సొసైటీ అధ్వర్యంలో మండల జూనియర్ కళాశాలలో 50 మంది పేదలకు నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఆదినారాయణ, సొసైటీ ప్రెసిడెంట్ ఎన్.ఝాన్సీలక్ష్మి, ఫౌండర్ సాంబశివరావు, తదితరులు హాజరయ్యారు.

ఒమ్మిలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం



ప్రకృతి వ్యవసాయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఒమ్మి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ఆ విభాగం డీపీఎం సత్యనారాయణ, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దురగాశి ఎర్రంనాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని కోరారు.కార్యక్రమంలో గాయత్రి, రామలక్ష్మి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ప్రగతి వాకర్స్ క్లబ్ సభ్యులు

విజయనగరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి భావి తరాలకు మెరుగైన వాతావరణం అందివ్వాలని ప్రగతి వాక ర్స్ క్లబ్ అధ్యక్షుడు దారపు శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పూల్‌బాగ్, మున్సిపల్ పార్క్ నడక మైదానంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు దారపు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, వాకర్స్ ఇంట ర్నేషనల్ పిలుపు మేరకు మొక్కలు నాటి పర్యావర ణాన్ని పరిరక్షిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న పద్మనాభరాజు

విజయనగరం పూల్‌బాగ్: విద్యార్థులు చిన్నప్పుడు నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఏపీఎస్పీ 5వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ పద్మనాభరాజు అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ జోసెఫ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో తైక్వాండో, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్ రంగాలలో రజత, గోల్డెమెడల్ సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ పుష్పమేరీ, కరస్పాండెంట్ సిస్టర్ వందన, సిబ్బంది బెనర్జీ పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- గుంకలాం జగనన్న కాలనీలో 730 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అర్హులైన ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గుంకలాం జగనన్న కాలనీలో 730 మందికి ఇళ్ల పట్టాలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లే అవుట్‌లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. పట్టణ ప్రాంతంలో పట్టాలు పొందే అర్హత ఉన్నప్పటికీ కొన్ని కారణాలవల్ల గతంలో మంజూరు కాలేని వారిలో 730 మందికి ప్రస్తుతం పట్టాలు అందించినట్లు తెలిపారు. ప్రజలందరూ బాగుండాలనే ఉద్దేశంతోనే జగనన్న పాలనలో సమూల మార్పులు తీసుకువచ్చారన్నారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు గృహవసతి కూడా కల్పించాలనే లక్ష్యంతో పాలన సాగుతోందని తెలిపారు. నగరంలో సొంతిళ్లు లేని సుమారు 13,000 మందిలో కొంతమందికి 2020 డిసెంబర్‌లో కొండకరకాం, సారిక, గుంకలాం లేఅవుట్‌లలో స్థలాలు కేటాయించామన్నారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే జమ్ము ప్రాంతంలో స్థలాలు మంజూరు చేస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అవినీతి లేదని స్పష్టం చేశారు. స్థలాలు పొందిన వారు ఎంత త్వరగా ఇల్లు నిర్మించు కుంటే అంత త్వరగా సౌకర్యాలు మెరుగుపడతాయ ని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, వివిధ డివిజన్ల కార్పొరేట ర్లు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, గృహ నిర్మాణ సంస్థ అధికా రులు, తహసీల్దార్ శ్రీనివాసరావు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలి..



తల్లిదండ్రులకు నమస్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

విజయనగరం: తల్లిదండ్రుల త్యాగాలకు వారి వారసులుగా పిల్లలు రుణం తీర్చుకోవాలని, వృద్ధాశ్రమాలు లేని రోజే అసలైన తల్లిదండ్రుల దినోత్సవమని సాయికృష్ణ వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఏఎస్ ప్రకాశరావు తెలిపారు. జాతీయ తల్లిదండ్రుల దినోత్సవాన్ని సాయికృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న వాకర్స్ నడక మైదానంలో ఆదివారం ఉదయం క్లబ్ అధ్యక్షుడు చెల్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ, తల్లిదండ్రులు మన మానవాళికి ప్రత్యక్ష దైవాలని.. పిల్లల అభివృద్ధి కోసం తమ శక్తినంతా ధారపోస్తారని చెప్పారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను పూజించాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ గౌరవ సలహాదారులు ఎ.తిరుపతిరావు, సీనియర్ సభ్యులు జనార్దనరావు మాస్టారు, క్లబ్ యోగా గురువు ఎస్.చక్రధర్‌పట్నాయక్, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ రాష్ట్ర కమిటీ సభ్యుడు సదాశివరావు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటీ సభ్యులు ఆదివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 50,677 ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. విద్యారంగం అభివృద్ధికి వ్యతిరేకంగా నిలుస్తున్న 84, 85, 117 జీఓలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కమిటీ అధ్యక్షులు డి.ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.సదాశివరావు, సీహెచ్ వెంకటరమణ, వి.ధనంజయనాయుడు, ఎం.బలరాం నాయుడు, బీవీ పైడిరాజు, ఏవీ శ్రీనివాసరావు, వి.అప్పలరాజు, కె. సత్యారావు, సీహెచ్ రామారావు, డి.వెంకటనాయుడు, గంట సత్యనారాయణ, పి.రమేష్ నాయుడు, బి.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

- బాక్సింగ్ క్రీడాకారులను అభినందించిన డిప్యూటీ స్పీకర్



బాక్సింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: క్రీడలకు, క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బాక్సింగ్ పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆదివారం తన నివాసం వద్ద అభినందించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సెట్విజ్ సీఈఓ రాంగోపాల్ మాట్లాడుతూ, స్కూల్ గేమ్స్ అండర్ - 13, 17, 19 విభాగాలతో పాటు, 75-80 కిలోల విభాగం, యూత్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపారని తెలిపారు. అరుణాచల్‌ప్రదేశ్, రాజమండ్రి, విజయవాడ, సిక్కిం, తదితర ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో గోల్డ్, బ్రాంజ్, సిల్వర్ పతకాలు సాధించారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు కంటుభుక్త తవిటిరాజు, క్రీడా అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

27న రక్తదాన శిబిరం

విజయనగరం ఫోర్ట్: భారతరత్న, మాజీ ఉపరాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా ఈనెల 27న రోటరీ రక్తనిధి కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు అబ్దుల్ కలాం బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్ తెలిపారు. ఈమేరకు రక్తదాన శిబిరానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సయ్య ద్ తాజ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అబ్దుల్ రవూఫ్, తదితరులు

అధ్వానంగా జాతీయ సర్వీస్ రోడ్డు



పూసపాటిరేగలో గతుకులమయంగా మారిన సర్వీస్ రోడ్డు

పూసపాటిరేగ: మండల కేంద్రమైన పూసపాటిరేగలో జాతీయరహదారి సర్వీస్ రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా వదిలేయడంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సర్వీస్ రోడ్డు వర్షానికి గతుకులమయంగా మారడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి సర్వీస్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మీనామృతంతో అధిక దిగుబడులు



మీనామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి సుజాత, తదితరులు

డెంకాడ: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మీనామృతం వినియోగించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి బి. సుజాత అన్నారు. మండలంలోని గుణుపూరులో మీనామృతం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చేపల వ్యర్థాలు, బెల్లంతో మీనామృతం తయారు చేస్తారని చెప్పారు. పంటపై మీనామృతం పిచికారీ చేయడం వల్ల నాణ్యమైన దిగుబడులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ ఎస్.ఉమామహేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందుతున్నాయా..?



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల శ్రావణి, తదితరులు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ శ్రావణి

విజయనగరం: నగరంలోని 24వ డివిజన్ పరిధి బూర్లెపేట పరిసర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం వర్షంలోనూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. ప్రభుత్వం పాలనపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకురాగా.. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ నడిపేన శశిభార్గవి, కార్పొరేటర్ పిల్లా రాధాభవానీ, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'స్వచ్ఛంద సంస్థలు తోడ్పాటునందించాలి'



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సంస్థ నిర్వాహకులు

విజయనగరం టౌన్: సమాజ అభ్యున్నతికి స్వచ్ఛంద సంస్థలు తోడ్పాటునందించాలని సీనియర్ న్యాయవాది పల్లంట్ల వెంకట రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కణపాక యూత్ హాస్టల్‌లో పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, సాగునీటి చెరువుల ప్రాముఖ్యత, సమాజంపై అవినీతి ప్రభావం అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి వారిని సమాజం పట్ల జాగృతి చేయడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా కరోనా కష్టకాలంలో సేవలందించిన పార్వతీపురానికి చెందిన హెచ్‌సీ కృష్ణమూర్తి, రచయిత్రి కుసుమంచి శ్రీదేవి, సంగీత దర్శకులు పీవీఆర్ రాజా, తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్లపూడి సుభద్రాదేవి, గురుస్వామి కందాల సాయిబాబా, చింతలపూడి త్రినాథరావు, కె.ఎర్నాయుడు, మమ్ముల తిరుపతిరావు, టి.మహేశ్వరరావు, చారి, డి.సతీష్, సురేష్, బెల్లాపు సత్యనారాయణ, ఆదుర్తి రామచంద్రరావు, ఆశ్రయ రామకృష్ణ, ఐశ్వర్య, తేజ, ఉమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ రేపు

విజయనగరం పూల్‌బాగ్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల25న రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ చేపడుతున్నట్లు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక అమర్‌భవన్‌లో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసనలు చేశామన్నారు. ఈ సమయంలో ఎంతోమంది ఏఐఎస్ఎఫ్ నాయకులను అరెస్ట్ చేయడం అన్యాయమని చెప్పారు. సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులు నాణ్యమైన భోజనం, సరైన మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పెరిగిన నిత్యావసరల ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని కోరినా ఇంతవరకు ప్రభుత్వం స్పందించలేదన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 53 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

నూతన జాతీయ విద్యా విధానం వల్ల రాష్ట్రంలో వేల సంఖ్యలో పాఠశాలలు మూతపడ్డాయని.. 3,4,5 తరగతుల విలీనం వల్ల విద్యార్థులు విద్య దూరమవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సునీల్, ఎన్.నాగభూషణం, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పీకేఎల్ రాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు గౌరీశంకర్, శ్రావణ్‌కుమార్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మయూరి జంక్షన్ వద్ద బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, స్థానిక కార్పొరేటర్ జీవీ రంగారావు, తదితరులు

విజయనగరం: ప్రజలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా నగరంలో అభివృద్ధి పనులను ప్రాధాన్యతాక్రమంలో చేపడుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నెల రోజుల పాటు చేపట్టదలచిన శంకుస్థాపన మాసోత్సవాలు పండగ వాతావరణంలో సాగడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. నగరంలోని వివిధ డివిజన్‌లలో ఆదివారం చేపట్టిన ప్రారంభ, శంకుస్థాపన కార్యక్రమాలలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. 33వ డివిజన్ మయూరి జంక్షన్ నుంచి శ్రీనివాస కాలేజీకి వెళ్లే బీటీ రహదారిని ప్రారంభించారు. 38వ డివిజన్ ఉడాకాలనీ ఫేజ్-3 పరిధిలో గల శివాలయం వద్ద చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. 36వ డివిజన్ వీటీ అగ్రహారం మజ్జిపేట చర్చి రోడ్డు వద్ద అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్ల కార్పొరేటర్లు జీవీ రంగారావు, తొగురోతు సంధ్యారాణి, బాలి పద్మావతి మాట్లాడుతూ, రూ. 33 లక్షలతో మయూరి జంక్షన్ రహదారిని పూర్తిచేసి ప్రారంభించినట్లు చెప్పారు. అలాగే రూ. 13.65 లక్షలతో 38వ డివిజన్‌లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని తెలిపారు. అపరిష్కృత సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా డిప్యూ టీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా శంకుస్థాపనల మాస మ హోత్సవం పేరిట నెల రోజులు పాటు వివిధ డివిజన్‌లలో ఏదో ఒక ప్రాంతంలో శంకుస్థాపనలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. త్వరలోనే వాటిని ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్‌లు రెడ్డి గురుమూర్తి, మారం బాల బ్రహ్మారెడ్డి, బొద్దాన అప్పారావు, కె.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీ పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి..



విజయనగరం పూల్‌బాగ్: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

పూసపాటిరేగ: మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి. సూర్యనారాయణ కోరారు. అలాగే బీజేపీ మతోన్మాద విధానాలను విడనాడాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆదివారం స్థానిక రాజావీధిలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మణిపూర్‌లో రెండు గిరిజన తెగల మధ్య 80రోజులుగా విధ్వంసకాండ జరుగుతోందన్నారు. ఇంతటి ఘోరాన్ని నివారించడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా బీజేపీ నాయకులు స్పందించి మణిపూర్‌లో హింసాత్మక సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ సభ్యులు పాల్గొన్నారు.

నిరసన..

డెంకాడ: మణిపూర్‌లో జరుగుతున్న ఘోరాలను నివారించి, శాంతి నెలకొల్పే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు ఎన్. సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని అక్కివరం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో నరిసినాయుడు, పెంటరాజు, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ..

విజయనగరం పూల్‌బాగ్: మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను నివారించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కోట జంక్షన్ నుంచి గంటస్తంభం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సీహెచ్ పావని, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి రమణమ్మ మాట్లాడుతూ, మణిపూర్‌లో బీజేపీ సృష్టించిన అల్లర్లకు మహిళలు హత్యాచారాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతజరుగుతున్నా ప్రధాని మోదీ నోరు మెదపకపోవడం దారుణమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటేష్, గర్ల్స్ కన్వీనర్ సౌమ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు లావణ్య, సంధ్య, దీవెన, కల్యాణి, పాల్గొన్నారు.



విజయనగరం టౌన్: రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సంఘమిత్ర ఆర్ఎస్.జాన్

రాష్ట్రపతి పాలన విధించాలి

విజయనగరం టౌన్: మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని సంఘమిత్ర ఆర్ఎస్.జాన్ అన్నారు. మణిపూర్‌లో మైనార్టీల మారణకాండపై సిమ్స్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో మైనారిటీ సంస్థల ప్రతినిధులు, ప్రజాస్వామ్యవాదులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మణిపూర్‌లో ప్రత్యేకంగా క్రైస్తవులపై దాడులు చేయడం, 500 చర్చిలను తగులబెట్టి, సుమారు వంద మందికి పైగా క్రైస్తవులను హతమార్చడం సిగ్గు చేటన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ పట్టణ శాఖ అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్, ఐద్వా రమణమ్మ, యబ్బోజు చౌదరి, మధుమనోహర్, పద్మనాభం, పి.వెంకటరమణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గంట్యాడ: వర్షాలు కురుస్తున్నందున డెంగీ, మలేరియా, చికున్ గున్యా, వైరల్ జ్వరాలు తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తం గా ఉండాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. వ్యవసాయం, వైద్యారోగ్యం, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, గృహనిర్మాణం, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖలపై ఎంపీపీ సమీక్ష నిర్వ హించారు. ఆయా శాఖల్లో ప్రగతిని అధికారులు సభకు వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను రైతు భరోసాకేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా సీజనల్ వ్యాధులు ప్రబలితే వెంటనే వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యసేవలందించాలని చెప్పారు.